



తిరుపతి ప్రగతి నగర్‌లో విరాళాల సేకరణకు అపూర్వ స్పందన



మార్పు..నిట్టూర్పు..!

- రిజర్వుడ్‌లోనే మార్పుల 'వేటు'/ • 'జనరల్'లో 'సిట్టింగ్'లకే చోటు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల మార్పులు చేర్పులపై నెలకొన్న గందరగోళం వైసిపికి తలనొప్పిగా మారింది. జీడీనెల్లూరు, సత్యవేడు, చిత్తూరు, పూతలపట్టు, గూడూరు అసెంబ్లీ నియోజకవర్గాలు, చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థుల మార్పుపై ఆ పార్టీ శ్రేణులు పెదవి విరుస్తున్నాయి. సత్యవేడులో సిట్టింగ్ ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలంను కొనసాగించినా బాగుండేదని ఆ నియోజకవర్గ నేతలు అభిప్రాయపడుతున్నారు. కొత్తగా నూకతోటి రాజేష్‌ను సమన్వయ కర్తగా నియమించడంతో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అలాగే జీడీనెల్లూరులో నారాయణస్వామి సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే వ్యతిరేకించారు. అయినా పెడచెవిన పెట్టిన అధిష్టానం మళ్లీ నారాయణస్వామికే కేటాయించింది. పూతలపట్టులో ఎంఎస్‌బాబుపైన అంత వ్యతిరేకత లేదని, గతంలో ఎంఎల్‌ఎగా పనిచేసిన డాక్టర్ సునీల్‌పై నియోజకవర్గ ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా ప్రకటించడం పట్ల భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. చిత్తూరు ఎంపి రెడ్డెప్పను జీడీనెల్లూరుకు పంపి, మళ్లీ యథాస్థానానికి ప్రకటించారు. అలాగే గూడూరులో సిట్టింగ్ ఎంఎల్‌ఎ వరప్రసాద్‌ను కాదని, మేరిగ మురళీకి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ చివరి నిమిషం వరకూ గట్టి ప్రయత్నం చేశారు.

చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల్లో పరిశీలిస్తే అధికార వైసిపి అభ్యర్థుల గందరగోళమంతా రిజర్వుడు నియోజకవర్గాల్లోనే సాగింది. అయితే జనరల్ స్థానాల్లో ఒక్కరిని కూడా కదిలించిన పరిస్థితి లేదు. ఒక్క చిత్తూరు తప్ప. ఆరో జాబితాలోనూ రిజర్వుడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్పులు చేశారు. అభ్యర్థుల నామినేషన్ వేసే వరకూ ఇలా అభ్యర్థులను మారుస్తూనే ఉంటారా? అన్న చర్చ నడుస్తోంది. రిజర్వుడు స్థానాలన్నింటిలోనూ రెండు గ్రూపులు వైసిపిలో ఉన్నాయి. ఒకరు సిట్టింగ్ కావాలని ప్రెస్‌మీట్ పెడితే, మరొకరు వద్దని. ఇలా ఎవరి డామినేషన్ ఉంటే వారి అభ్యర్థులనే ప్రకటించడం గమనార్హం.

'జనరల్'లో అభ్యర్థుల మార్పు లేనట్టేనా..

ఒక్క చిత్తూరు అసెంబ్లీనియోజకవర్గం మినహాయించి మిగిలిన అన్ని జనరల్ స్థానాల్లోనూ అధిష్టానం అభ్యర్థుల మార్పుకు ఏమాత్రం సాహసించని పరిస్థితి. తిరుపతి జిల్లాలో తిరుపతి భూమన అభినయరెడ్డి, చంద్రగిరి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, శ్రీకాళహస్తి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటగిరి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిలే అభ్యర్థులు. వీరంతా 'రెడ్డి' సామాజికవర్గమే కావడం గమనార్హం. ఒక్క సూళ్లూరుపేట రిజర్వుడు మాత్రం అభ్యర్థిని మార్చకుండా సిట్టింగ్‌కే కేటాయించారు. చిత్తూరు జిల్లాలో చిత్తూరు విజయానందరెడ్డి, పుంగనూరు పెద్దిరెడ్డి, కుప్పం భరత్, నగరి ఆర్‌కె రోజారెడ్డి, పలమనేరు వెంకటేగౌడలు అభ్యర్థులుగా ఉన్నారు.

పోరాటాలకు బాసటగా...

సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

పేద ప్రజల పోరాటాలకు బాసటగా ఉంటున్న సిపిఎంకు విరాళాలిచ్చి ఆదరించాలని సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు హరికిషోర్, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం తిరుపతి ప్రగతి నగర్‌లో 'సిపిఎం విరాళాల సేకరణ'ను ప్రారంభించారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు గంటపాటు ఆ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించగా ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో సిపిఎం చేసిన పోరాటాలను వివరించారు. తాజాగా అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, విఒఎలు, ఎస్‌ఎస్‌ఎలు చేసిన ఉద్యమాలకు అండగా సిపిఎం ఉందన్నారు. దీర్ఘకాలికంగా మూడేళ్ల పాటు టిటిడి అటవీ కార్మికులు రిలే, నిరాహారదీక్షలు చేసి ఘనసీయమైన విజయం సాధించారన్నారు. టిటిడి ఉద్యోగులకు ఇళ్లస్థలాలు దీర్ఘకాలికంగా చేసిన పోరాటాల ఫలితమేనని గుర్తు చేశారు. కార్మిక, కర్షక, ఉద్యోగ ఉపాధ్యాయులకు అండగా నిలుస్తున్న సిపిఎంకు ఆర్థికంగా విరాళాలిచ్చి, పోరాటాలకు అండదండలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.లక్ష్మి, హేమలత, రవి, ఎ.వనజ, సిఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ఆధునిక వైద్యసేవలందాలి

వైద్య శాఖ సమీక్షలో కలెక్టర్ లక్ష్మీషా

ప్రజాశక్తి - తిరుపతి సిటి



పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రులలో ఆధునిక సదుపాయాలు కల్పించి, వైద్య సిబ్బంది నియామకం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తదితర కార్యక్రమాలు అమలు చేస్తోందని, వైద్య వత్తి ఎంతో పవిత్రమైనదని వారి సేవలు ప్రజలకు ఎంతో ముఖ్యమని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీషా అన్నారు. శనివారం రుయా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శాఖ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెంపుల్ సిటీ అయిన తిరుపతి జిల్లాలో ఆసుపత్రులకు వైద్యం కొరకు వచ్చే రోగులకు మంచి వాతావరణం, ట్రీట్మెంట్ ఉండేలా ఆసుపత్రులు ఉండాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు పేద ప్రజలకు ఒక గొప్ప వరం అని సర్జరీలు, చికిత్సలు అవసరమైన పేద ప్రజలకు వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనితీరు ఉండాలని కోరారు. సమావేశానికి ముందు ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ, క్యాజువాల్టీ, ఐసియూ, స్పెషాలిటీ వార్డులు, వివిధ విభాగాలను, వాటిలో టాయిలెట్స్ శుభ్రతను పరిశీలించి శానిటేషన్ మెరుగుపడాలని సూచించారు. రుయా ఆస్పత్రిలోని ప్రభుత్వ సీ.టీ స్కాన్ విభాగాన్ని పరిశీలించారు. రోజుకు సరాసరి స్కానింగ్ కు వస్తున్న వివరాలు పరిశీలించారు. నవజాత శిశువుల విభాగం అక్కడ అందుతున్న సేవలు పరిశీలించారు. రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ కలెక్టర్ కు వివరిస్తూ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ప్రసవాలు నెలకు సుమారు వెయ్యి జరుగుతున్నాయని, ఇది రాష్ట్రంలోనే అత్యధిక ప్రసవాలు జరిగే ఆసుపత్రుల్లో రెండవది అని అన్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్, టీబీసీడి యూనిట్ నిర్మాణం పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ యు. శ్రీహరి, రూయ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, స్విమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్ర శేఖరన్, ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, స్విమ్స్ సూపరింటెండెంట్ రామ్, డిసిహెచ్‌ఎస్ ఆనంద మూర్తి, ఈఎస్ ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త రాజశేఖర్, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి తేజేశ్వరి పాల్గొన్నారు.

'చెవిరెడ్డి' వెంటే ఆ 'ఎస్‌పి'



ఒంగోలుకు బదిలీలో భాస్కర్‌రెడ్డి 'మార్క్'



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన రాజకీయ మార్కును మరోసారి చాటుకున్నారు. తిరుపతి అర్బన్ ఎస్పీగా ఉన్న పరమేశ్వర్ రెడ్డిని ఒంగోలు ఎస్పీగా వేయించుకుని వెంటే తీసుకెళ్లారు. ఒంగోలు ఎస్పీగా పని చేస్తున్న మల్లిక గార్గ్‌ను తిరుపతికి వేయించుకున్నారు. ఇదంతా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పక్కా ప్రణాళికని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఒంగోలులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎంపిగా బరిలో దిగనున్న నేపథ్యంలో గెలవడానికి తిరుపతి అర్బన్ ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిని నియమించుకున్నారు. తిరుపతి అర్బన్ ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తిరుపతి జిల్లాలో భారీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ దొంగ ఓట్లు వేసింది. ప్రతిపక్ష పార్టీలు దొంగ ఓట్లను స్వయంగా పట్టించినా అర్బన్ ఎస్పీ వారిని వదిలివేసారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తిరుపతి నియోజకవర్గంలో భారీగా దొంగ ఓట్లు వేశారని ఎన్నికల కమిషనర్ ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషనర్ స్పందించి, ఉపాధ్యాయ పట్ట భద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో రీపోలింగ్ నిర్వహించింది. రీ పోలింగ్లోనూ వైఎస్ఆర్ కాంగ్రెస్ దొంగ ఓట్లు వేశారు అనే పెద్ద ఎత్తున గొడవలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పట్టుబద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు వైసిపి, టిడిపి చెరొకటి చొప్పున గెలిచారు. ప్రతిపక్ష పార్టీ చేసే ఆందోళనలకు పోలీసులు అడుగడుగునా అడ్డుపడేవారు. నిర్బంధాలూ ఎక్కువయ్యాయి. త్వరలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వస్తున్న సందర్భంగా పరమేశ్వర్ రెడ్డిని బదిలీ చేస్తారని ప్రచారం జరిగింది. అయితే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రూపంలో ఒంగోలుకే బదిలా కావడం గమనార్హం.

ఒంగోలులో వైసీపీ ప్రజాప్రతినిధుల గందరగోళంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి జగన్ పై దండయాత్రకు పూనుకోవడంతో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మంత్రి రోజా పేర్లు అధిష్టానం పరిశీలించింది. ఒంగోలు ఎంపీగా రోజా పోటీ చేయడానికి ఆసక్తి చూపలేదు. తనకు నగిరి నియోజకవర్గం కావాలని పట్టు పట్టడంతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ప్రకటించింది. వాస్తవానికి మల్లికా గార్గ్ బదిలీపై మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పట్టుదలతో ఉన్నారు. రవీంద్రనాథ్బాబు కోసం ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. ఈ విషయాన్ని కొందరు అంతరంగికులతోనూ పంచుకున్నట్లు తెలిసింది. అంతలోనే చెవిరెడ్డి చక్రం తిప్పారు. ప్రస్తుతం తన సొంత జిల్లాలో పనిచేస్తున్న పరమేశ్వరెడ్డిని నియమించడంలో కీలకపాత్ర పోషించారు. జిల్లా ఎస్పీ గార్గ్ బదిలీ ద్వారా నూతన సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరెడ్డి బాధ్యతలు స్వీకరించక ముందే తన మార్కు ప్రదర్శించారు. ప్రకాశంపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శించారనే చర్చ సాగుతోంది.

శారీ పెయింటింగ్‌పై శిక్షణ ముగింపు

ప్రజాశక్తి-క్యాంపస్

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. డి.ఉమాదేవి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు శారీ పెయింటింగ్ పై శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. జనవరి 29న ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం ఎస్వీ నగర్, పెరుమాళ్లపల్లె గ్రామ మహిళలకు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. డి.ఉమాదేవి మాట్లాడుతూ శారీ పెయింటింగ్ పైన ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి సాధించగలిగారని, తద్వారా ఆర్థికంగా మహిళలు అభివద్ధి చెందారన్నారు. తాము ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకుఉపాధి అవకాశాలు ఇచ్చే స్థాయికి ఎదగగలరని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పద్మ మహిళలకు శిక్షణ ఇచ్చారు. మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ ఎం. ఇంద్రాణి సహకరించారు. ఈ కార్యక్రమంలో 40 మంది మహిళలు శిక్షణ పొందారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

తిరుపతి సిటి : తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యం భారిన పడి చికిత్స పొందుతున్న వారికి సిఎం సహాయ నిధికింద ఎంపి గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ చెక్కులను పంపిణీ చేశారు. సత్యవేడు నియోజకవర్గం పెద్దఏటిపక్కమ్ గ్రామానికి చెందిన రవికి 2 లక్షలు, కెవిబిపురంకు చెందిన కె.సుబ్రమణ్యంకు 1.3 లక్షలు, కనమనంబేడుకు చెందిన వై.రామచంద్రనాయుడుకు 8 లక్షలు, వరదయ్యపాళెం గంగమిట్టకు చెందిన మంజులకు 1.1 లక్షలు, అల్లప్పగుంట చల్లా నాగయ్యకు రూ.2.3 లక్షలు, సూళ్లూరుపేట నియోజకవర్గం తడకు చెందిన బి.దొరబాబుకు 2.7 లక్షలు, వెంకటగిరి నియోజకవర్గం వి.వినయ్‌కు 1.3 లక్షలు, శ్రీకాళహస్తి నియోజకవర్గం పొంగూరుకు చెందిన జి.రామచంద్రారెడ్డికి 0.6 వేలు అందజేశారు. మొత్తం 19 లక్షల 3వేల రూపాయలను అందజేశారు.

ఘనంగా 'గీతాంజలి' వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



గీతాంజలి విద్యాసంస్థల 23వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమన్నారు. అలాంటి సంస్కృతిని భావిభారత పౌరులైన విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఇస్కాన్ ప్రతినిధి ప్రభు మాట్లాడుతూ సంపదకు సరి సమానంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే మానసిక ప్రశాంతం అవసరం అన్నారు. స్కూల్ డైరెక్టర్ ఎన్. మాధవి మాట్లాడుతూ భావి భారత పౌరులైన పిల్లలకు విలువలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో 23 సంవత్సరాల క్రితం గీతాంజలి విద్యాసంస్థల ప్రారంభించమన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ తిరుపతి నగరంలో మూడు బ్రాంచ్లు ఏర్పాటు చేశామన్నారు. రాబోవు విద్యా సంవత్సరంలో రామచంద్రపురం వద్ద నూతన బ్రాంచ్ ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. స్కూల్ ఛైర్మన్ ఎస్. సురేంద్ర, ఎన్జీవో నాయకులు సురేష్ బాబు, ప్రిన్సిపాల్ ఎస్. వి. రమణ పాల్గొన్నారు.

మరింత గొప్పగా ధర్మ ప్రచారం

ధార్మిక సదస్సులో భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుమల



మఠాధిపతులు, పీఠాధిపతుల సలహాలు, సూచనలతో సనాతన హిందూ ధర్మప్రచారాన్ని మరింత గొప్పగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్టు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో శనివారం శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు వైభవంగా ప్రారంభమైంది. భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో అనేక ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. తాను తొలిసారి ఛైర్మన్ గా ఉన్న సమయంలో రెండు సార్లు ధార్మిక సదస్సులు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు, సలహాలను స్వీకరించి దళిత గోవిందం, మత్స్య గోవిందం, గిరిజన గోవిందం లాంటి కార్యక్రమాల ద్వారా భగవంతుడిని భక్తుల చెంతకు తీసుకెళ్లామని చెప్పారు. స్వామీజీల సూచనలతోనే ఎస్వీబీసీ ఛానల్ ఏర్పాటు చేసి ధర్మ ప్రచారానికి కొత్త అధ్యాయం ప్రారంభించామని గుర్తు చేశారు. సనాతన హిందూ ధర్మ ప్రచారాన్ని చిత్త శుద్ధితో ప్రజలకు చేరువ చేస్తున్న టీటీడీపై అవాస్తవ విమర్శల దాడి జరుగుతోందని స్వామీజీలకు విన్నవించారు. తమ వైపు నుంచి ఏవైనా పొరబాట్లు జరిగి ఉంటే తగిన సూచనలు, సలహాలు ఇస్తే వాటిని సవరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సదస్సు రెండో సెషన్‌లో బ్రహ్మంగారి మఠం విరజానంద స్వామి మాట్లాడుతూ భజనల్లో పిల్లల్ని భాగస్వాములను చేయాలన్నారు. ఏర్పేడు వ్యాసాశ్రమం పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోనూ ధర్మ ప్రచారం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థిత ప్రజ్ఞానంద సరస్వతి స్వామి, హరితీర్థానంద స్వామి పాల్గొన్నారు. జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి రాణి సదాశివమూర్తి, అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విభీషణశర్మ పాల్గొన్నారు.

స్వయం సంఘాలు బలోపేతం కావాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

స్వయం సంఘాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీహరిరావు తెలిపారు. శనివారం శ్రీ మంత్ర రాజ పీఠాధిపతి "సింహ యాజి స్వామి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ - జాతీయ ఉపాధ్యక్షులు "డా. శ్రీహరి రావు చెన్నారెడ్డి కాలనీలో నవభారత్ సేవా సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. డా.శ్రీహరిరావు" మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల అభివద్ధికి అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. మహిళలు ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకుని అన్ని విధాలుగా ఎదగాలన్నారు. నవ భారత సేవా సమాజ్ ప్రధాన కార్యదర్శి రహమతుల్లా షరీఫ్, సంస్థ సిబ్బంది లావణ్య, సుమలత, పద్మ, కలివాణి పద్మావతి పాల్గొన్నారు.



లక్ష్య సాధనలో సవాళ్లను అధిగమించాలి

ప్రజాశక్తి-క్యాంపస్

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని, లక్ష్యసాధనలో ఎదురయ్యే సవాళ్లను, ఒత్తిడిని అధిగమించాలని సైకాలజిస్ట్ బండి రుక్మిణి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఇ.కోనప్రభ శనివారం నర్సింగ్ విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం పై అవగాహన కల్పించారు. డాక్టర్. కోనప్రభ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివద్ధికి విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడం చాలా అవసరమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే విలువలు, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాభవాని, మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది ప్రీతి పాల్గొన్నారు.

చెవిలో పువ్వుతో టిఎన్‌ఎస్‌ఎఫ్ నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన మోసపూరిత డీఎస్సీ నోటిఫికేషన్‌కి వ్యతిరేకంగా తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద తెలుగు యువత నిరసన కార్యక్రమం చేపట్టింది. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు మాట్లాడుతూ నిరుద్యోగులను మభ్య పెట్టేందుకే జగన్మోహన్ రెడ్డి తూతూ మంత్రంగా డీఎస్సీని విడుదల చేస్తున్నారని విమర్శించారు. ప్రతియేటా 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తానని జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. పది రోజుల్లో ఎలక్షన్ నోటిఫికేషన్ వస్తుంది అనగా 6,100పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం విడ్డూరం గా ఉందన్నారు. ఓట్ల కోసమే డీఎస్సీ నోటిఫికేషన్ డ్రామా. ఆడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయాదవ్, హేమంత్ రాయల్ పాల్గొన్నారు.

పోరాడితే పోయేదేమీ లేదు..

తప్పక ఘన విజయాలు

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

దశాబ్దాల పోరాటానికి...మూడు సంవత్సరాల సుదీర్ఘ దీక్షకు... ఏళ్ల తరబడి నిరీక్షణకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. టిటిడి కార్మికులు సిఐటియు అండతో సమస్యలు పరిష్కరించుకోవడంతో వారి కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది. పోరాటాలతో ఏదైనా సాధించొచ్చని టిటిడి కార్మికులు మరోసారి నిరూపించారు. వీరి పోరాటం టిటిడి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది. ఎన్నికష్టాలు వచ్చిన, ఒత్తిడిలు వచ్చిన మొక్కవోని ధైర్యంతో పోరాటాలు చేపట్టి, విజయం సాధించిన కార్మికులకు రెడ్ సెల్యూట్. 'పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప'.. ప్రశ్నిస్తేనే హక్కులు లభిస్తాయన్నది అక్షర సత్యం.

టిటిడి బోర్డు తీర్మానాన్ని అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును వర్తింపజేయాలని, సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని టిటిడి అటవీకార్మికులు 38 నెలలుగా సుదీర్ఘ కాలం పాటు రిలే నిరాహారదీక్షలు చేపట్టిన విషయం విదితమే. టిటిడి అటవీవిభాగంలో సుమారు 30 సంవత్సరాలకు పైగా విధులు నిర్వహిస్తున్న 362 మంది కార్మికులు బోర్డు తీర్మానం ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండు చేపట్టారు. ఐకమత్యంగా ఉన్న కార్మికులను బూర్జువా రాజకీయ పార్టీలు కార్మిక సంఘాల పేరుతో విడగొట్టింది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అండతో అందులో 162 మందిని (పది సంవత్సరాలు డ్రాప్‌అవుట్ అయిన వారిని) రెగ్యులర్ చేశారు. ప్రాణాలకు తెగించి, కారడవుల్లో నిరంతరం విధులు నిర్వహించిన సీనియర్లను విస్మరించారు. దీనిపై అనేక సార్లు ఉన్నతాదికారులకు, టిటిడి పాలకమండలికి విన్నవించిన స్పందన కరువైంది. టిటిడి నూతనంగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లో అటవీ కార్మికులను విలీనం చేస్తూ నిర్ణయించడంతో విధిలేని పరిస్థితుల్లో అటవీకార్మికులు రిలే నిరాహారదీక్షకు పూనుకున్నారు. 38 నెలల పాటు సుదీర్ఘంగా రిలే దీక్షలు చేపట్టారు. అయినా టిటిడిలో స్పందన నిల్. దీంతో కార్మికులకు అండగా సిఐటియు జిల్లా ప్రదాన కార్యదర్శి కందారపు మురళీతో పాటు ఎనిమిది మంది కార్మికులు నిరవధిక నిరాహారదీక్షకు జనవరి 27వ తేది దిగారు. వీరి ఆరోగ్యం క్షీణించడంతో 29వ తేది అర్ధరాత్రి టిటిడి పోలీసుల సహాయంతో దీక్షలో ఉన్న వారిని అరెస్టు చేసి, బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. అయినా కార్మికులు పట్టువీడక మరో ఏడుగురు దీక్షకు దిగారు. వీరికి అఖిలపక్షం, ఇతర కార్మిక సంఘాలు, పౌరసమాజం మద్దతుగా నిలవడంతో పరిస్థితి చేయిదాటి పోతుందని భావించిన టిటిడి కార్మికులతో చర్చలకు దిగింది. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో అటవీ కార్మికులను లక్ష్మీశ్రీనివాస కార్పొరేషన్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు, పర్మినెంట్ తమ పరిధిలోలేనిది కనుక టైమ్‌స్కేల్ వర్తింప జేస్తామని, 2023 పిఆర్‌సి ప్రకారం 20వేల బేసిక్‌తో 22,600 రూపాయలు చెల్లిస్తామని అధికారులు ప్రతిపాదించారు. అధికారులలో మరోసారి పునరాలోచన చేయాలని కార్మికులు కోరడంతో ఛైర్మన్ కల్పించుకుని కార్మికులకు మరో 3,125 రూపాయలు వేతనం పెంచుతున్నట్లు ప్రకటించారు. రెగ్యులర్ కార్మికుల వేతనాలకు దగ్గరగా ఉండంతో చర్చలు సఫలం అయ్యాయి. మూడు దశాబ్దాల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. కార్మికుల కుటుంబాల్లో ఆనందం వెల్లువిరిసింది.

ఎఫ్‌ఎంఎస్ కార్మికుల పోరాటం సక్సెస్

టిటిడిలో పని చేసే ఎఫ్‌ఎంఎస్ కార్మికులు సైతం తమ పోరాటంతో సమస్యను పరిష్కరించుకున్నారు. టిటిడి హెల్త్ టెండరల్లో కొత్త నిబంధనలను రద్దు చేయాలని జనవరి 28న తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనం వద్ద నిరసనకు దిగిన విషయం విధితమే. 42 సంవత్సరాల పైబడిన వారిని విధుల్లోకి తీసుకోవద్దని, అందులోనూ 30 శాతం మహిళలు, 70శాతం పురుషులు ఉండాలని, సూపర్‌వైజర్లకు శానిటేషన్ సర్టిఫికెట్లు ఖచ్చితంగా ఉండాలని నిబంధనలు తేవడంతో ఏళ్లతరబడి పని చేస్తున్న సీనియర్ కార్మికులకు ఉద్వాసన తప్పదని తేలిపోయింది. దీంతో 7వేల మందికి పైగా ఉన్న ఎఫ్‌ఎంఎస్ కార్మికులు టిటిడి పరిపాలన భవనం వద్ద నిరసనకు దిగారు. వేలాది మంది కార్మికులు సిఐటియు సహకారంతో నిరసనకు దిగడంతో స్పందించిన టిటిడి యాజమాన్యం 29వ తేది జరిగిన పాలకమండలి సమావేశంలో కొత్త నిబంధనలు రద్దు చేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ ప్రకటించారు. దీంతో కార్మికులు తమ నిరసను విరమించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని కాంపాలెం ఎంపిపి పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని మండల రెండవ విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం, రాగి జావ రుచి చూశారు. విద్యార్థులకు రుచికరంతో పాటు నాణ్యమైన కూరగాయలతో చేసిన కూరలు అందించాలన్నారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పి పరమేశ్వర్ రెడ్డిని కలిసిన జెడ్‌పిటిసి

ప్రజాశక్తి- నారాయణవనం: ఒంగోలుకు బదిలీ అయిన ఎస్పి పరమేశ్వర రెడ్డిని నారాయణవనం మండలం జెడ్‌పిటిసి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్ కుమార్ శనివారం కలిసి శాలువ కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.

ఎలుకల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని చిట్టేడు గ్రామంలోని రైతులకు వరి పంటలో ఎలుకల ఉండడంతో కోట మండల వ్యవసాయ అధికారి వి. నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో ఎలుకల నివారపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శనివారం చిట్టేడు పంచాయతీలోని గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో సామూహిక ఎలుకల నివారణకు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏడిఏ ధనంజయ రెడ్డి, నాయుడుపేట డివిజన్ ఏడిఏ సుచేంద్ర ప్రసాద్, కోట మండల వ్యవసాయ అధికారి వి.నిరంజన్ కుమార్, తదితర వ్యవసాయ సహాయకులు,స్థానిక రైతులు పాల్గొన్నారు.

చెరువుకు వేలం పాట

ప్రజాశక్తి - ఓజిలి : మండల పరిధిలోని మాచవరం చెరువు వేలం పాటను డిల్‌పివో రవీంద్రబాబు, ఈవోపిఆర్డి మోహన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. చెరువు వేలం పాటలో బండి వంశి లక్ష 82 వేల రూపాయలకు చెరువు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మస్తానయ్య , వైసీపీ సీనియర్ నాయకులు పిండికూరు మధుసూదన్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' సీఎంవో పర్యటన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా సమగ్రశిక్ష సీఎంవో సురేష్ బియన్‌కండ్రిగ మండల పర్యటనలో భాగంగా శనివారం ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లమాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బీఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలో పిల్లలు బైజూస్ ట్యాబ్స్ వినియోగం, ఐఎఫ్‌పి ప్యానెల్ ను ఉపాధ్యాయులు ఎంతమేరకు వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకుని కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇవోలు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఉపాధ్యాయులు విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఈఈని కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి -కోట : గూడూరు సబ్ డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఈఈ కే నరేంద్ర రెడ్డిని కోట మండలం చెందోడు పంచాయతీ సర్పంచ్ దేవారెడ్డి, మాధవి భర్త వైసిపి సీనియర్ నాయకులు దేవా రెడ్డి, నాగూర్ రెడ్డి మర్యాద పూర్వకంగా శనివారం కలిసి విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ప్రజలకు సహకరించాలని ఈఈని దేవా రెడ్డి, నాగూర్ రెడ్డి కోరారు. విద్యుత్ శాఖ ఈఈ కే నరేంద్ర రెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టడంతో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశామని దేవా రెడ్డి నాగూర్ రెడ్డి తెలిపారు.

'జగనన్న ఇంటి పట్టాల' రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: నిరుపేదలకు ప్రభుత్వం అందించిన జగనన్న గృహ నిర్మాణ నివేశ స్థల పట్టాలను రిజిస్ట్రేషన్ త్వరిత గతిన పూర్తి చేయాలని సూళ్లూరుపేట ఆర్డిఓ చంద్రముని ఆదేశించారు. ఆయన దొరవారిసత్రం మండల పరిధిలోని తల్లంపాడు సచివాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆ సచివాలయ పరిధిలో మంజూరు చేసిన జగనన్న కాలనీ ఇంటి పట్టాల్లో ఎన్ని రిజిస్ట్రేషన్ జరిగాయి? ఆన్‌లైనులో పరిశీలించారు. ఆలస్యం కాకుండా అన్నింటినీ త్వరగా రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందించాలని వీఆర్వోకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ గోపీనాథ్ రెడ్డి, వీఆర్వో వెంకటరత్నం, ఇన్‌ఛార్జి కార్యదర్శి మస్తాన్ బాష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ సేవా సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో బలిజ సేవా సంఘం నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్ కె రోజా శనివారం భూమి పూజ చేశారు. బలిజ సేవా సంఘం నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని కులాలకు అతీతంగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్ ఏ హరి, వైస్ ఛైర్మన్లు డి జయప్రకాష్, డి శంకర్, బలిజ సంఘం నాయకులు, మెకానికల్ శివ, సదాశివ ఆలయ టెంపుల్ ఛైర్మన్ కె రమేష్ బాబు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, బలిజ సేవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించాలి: ఎంవిఐ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని పుత్తూరు ఎంవిఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం పుత్తూరు పట్టణంలో రోడ్డు భద్రత పై అవగాహన ర్యాలీ నిర్వహించి ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు విధి నిర్వహణలో నిబంధనలు పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట మోహన్. ఆటో డ్రైవర్లు. సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు 'వైఎస్ఆర్ ఆసరా' ఓ వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఓజిలి : మహిళలకు 'వైఎస్ఆర్ ఆసరా' ఓ వరం అని, మహిళ సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో వైయస్సార్ ఆసరాను ఇందిరా క్రాంతి పథకం కోఆర్డినేటర్ మురళి , ఏపీఎం నిర్మలమ్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 623 స్వయం సహాయక సంఘాల్లో 6,151 సభ్యులకు నాలుగవ విడతలో 4 కోట్లా 80 లక్షల 93 వేల రూపాయలు వైఎస్ఆర్ ఆసరా ద్వారా పొదుపు సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటమడుగు రవీంద్ర రాజు, ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి , ఎంపీటీసీ , గుంటమడుగు రఘురాం రాజు, ఉచ్చూరు శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కోట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాశాఖ కార్యాలయంలో భోజన విరామ సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కార్యదర్శి ఈ లక్ష్మి, కోట మండల సిఐటియు మండల అధ్యక్షులు ఎమ్ హరినాథ్, సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు కే రమణయ్య పాల్గొన్నారు.

మళ్లీ అధికారంలోకి రావాలని జగన్ ఆరాటం :మునికృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బాబాయి హత్యతో సానుభూతి పొందిన సీఎం జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ఏదో ఓ హత్యకాండతో అధికారంలోకి రావాలని ఆరాట పడుతున్నాడని నగరపాలక సంస్థ కార్పొరేటర్ ఆర్ సి మునికృష్ణ ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో అభివృద్ధి బాటను మరిచిన సీఎం జగన్ సొంత చెల్లెలు షర్మిల, తల్లి విజయమ్మ, వివేకా కూతురు సునీతల హత్యకు కుట్ర చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు.
ర్, ఏయికామ్ ప్రతినిధి భాలాజీ, డిఈ రాజు, కాంట్రాక్టర్ వున్నారు.

తహశీల్దార్ రమణయ్య హత్యపై ఖండన

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): తహశీల్దారు రమణయ్య హత్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చంద్రగిరి రెవెన్యూ శాఖ సిబ్బంది కార్యాలయం ఎదుట నిరసనగా ఉద్యోగులు నల్ల బాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రమణయ్య కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చదువులతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సూచించారు. సార్ ఇక జయరామారావు వీధిలో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందు క్రీడల టార్చ్ ను వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రీడల ఆవశ్యకతను విద్యార్థులకు విశదీకరించి చెప్పారు. ఏజీఎం సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

'నాన్నారం' బాలల పుస్తకం ఆవిష్కరణ


నాన్నారం బాలల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ రచయిత ఆర్‌సి క్రిష్ణస్వామి రాజు

ప్రజాశక్తి- నారాయణవనం: ప్రముఖ రచయిత ఆర్‌సిక్రిష్ణస్వామి రాజు నాన్నారం బాలల కథలు పుస్తకం స్థానిక బాలుర జెడ్.పి.హై స్కూలులో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సులోచన మాట్లాడుతూ పిల్లలు ఎదుగుదలకు పుస్తక పఠనం అవసరమన్నారు. ముఖ్య అతిథిగా తెలుగు ప్రాచీన కేంద్రం సంచాలకులు మాడ భూషీ సంపత్ కుమార్ పాల్గొన్నారు. ప్రధాన అతిథి డికె చదువుల బాబు మాట్లాడుతూ బాల సాహిత్యం వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందన్నారు. ఆత్మీయ అతిథి ఆచార్య యువ శ్రీ పిల్లలకు సులువుగా అర్థమయ్యే రీతిలో నాన్నారం కథలు ఉన్నాయని కొనియాడారు. పల్లిపట్టు నాగరాజు మాట్లాడుతూ పుస్తకాలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. విఆర్‌రాసాని నాన్నారం పుస్తకంలోని 30 కథలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రచయితలు , పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు వేగవంతంచేయాలి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ తుది దశ పనులను వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ఎం.డి అదితి సింగ్ అన్నారు. తుడా మైదానం ప్రక్కన నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పూర్తి అయితే క్రీడాకారులకు ఉపయోగపడేలా టెన్నిస్ కోర్టులు, స్నూకర్, షటిల్ కోర్ట్, ఇండోర్ క్రికెట్ పిచ్, క్యారమ్, జిమ్ తదితరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇప్పటికే దాదాపు పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేశామన్నారు. త్వరలో మిగిలిన అన్ని పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖ పాల్గొన్నారు.

అకౌంటెంట్ ప్రభాకర్‌కు పితృవియోగం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రజాశక్తి దినపత్రిక అకౌంటెంట్ ప్రభాకర్ తండ్రి బాలగురునాథం(64) కిడ్నీ సమస్యతో శనివారం మరణించారు. బాల గురునాథం మృతి పట్ల ప్రజాశక్తి జనరల్ మేనేజర్ హరి కిషోర్, తిరుపతి ఎడిషన్ మేనేజర్ సిఎస్ ప్రసాద్, బ్యూరో గోపి, డెస్క్ ఇన్‌ఛార్జ్, ప్రకటనల విభాగం జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాసులు, తిరుపతి సిటీ ఇన్‌చార్జి నాగరాజు, సర్క్యులేషన్ ఇన్‌చార్జీ సురేష్, గుణశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు.


ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

పెట్రోలు బంకు యజమాని నిర్లక్ష్యం

- పెట్రోలు నింపే సమయంలో సెల్‌ఫోను వాడకం
- తృటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- నారాయణవనం: నారాయణవనం మండలం పరిధిలోని పుత్తూరు –చెన్నై జాతీయ రహదారి పక్కనే వున్న హెచ్‌పి పెట్రోల్ బంక్ యజమాని నిర్లక్ష్యం కారణంగా శనివారం తృటిలో పెను ప్రమాదం తప్పిందని వాహనదారులు వాపోతున్నారు. ఓ పక్క ఫుల్ లోడ్‌తో వచ్చిన పెట్రోల్ ట్యాంకు లారీ నుండి స్టోరేజ్ చేస్తూ మరో పక్క వాహనాలకు పెట్రోలు పడుతుండడంతో వాళ్ల సెల్ ఫోనుల వినియోగిస్తుండడంతో పెను ప్రమాదం వాటిల్లే ప్రమాదాలు వున్నాయి. వాహన దారులు తక్షణం పెట్రోలు పట్టడం నిలిపివేసి ట్యాంకు నుండి పెట్రోల్ బంకులో స్టోరేజ్ అయిన తర్వాత వాహన దారులు పెట్రోల్ పట్టుకున్నారు. పెట్రోల్ బంకు యాజమాని నిర్లక్ష్యం వల్ల పెను ప్రమాదం జరిగి ఉండవచ్చని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పెట్రోల్ బంకు యాజమాన్యం



వాహనాలకు పెట్రోల్ పట్టే టప్పుడు సెల్‌ఫోన్లు వాడకూడదని పదేపదే చెబు తుంటారు. అయితే పెట్రోలు ట్యాంక్ నుండి స్టోరేజ్ చేస్తూ మరో పక్క వాహనాలకు పెట్రోల్ పట్టడం ఎంత ప్రమాదకరం గా ఉంటుందో యాజమాన్యం గుర్తించాల్సిన అవసరం వుంది. మరోసారి ఇలాంటి సంఘటన జరగకుండా జాగ్రత్త పాటించాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షేమ పథకాల ప్రదాత సీఎం జగన్

- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, పోణకా దేవసేనమ్మ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సంక్షేమ పథకాల ప్రదాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్సీ మేరిగ మురళీ ధర్, స్వచ్ఛఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ కొనియాడారు. గూడూరు పట్టణ సమీపంలోని సాయి నగర్‌లోని సీ.ఆర్ రెడ్డి కల్యాణ మండపంలో శనివారం 'వైఎస్సార్ ఆసరా' నాలుగో విడత సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను దేవసేనమ్మ ప్రారంభించారు. స్టాల్స్ లో ఏర్పాటు చేసిన తినుబండరాలు, ఇతర వస్తువులను వారు పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. వేదికపై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.సభా వేదిక వద్ద మహిళలు చేసిన కోలాటం వంటివి అందరినీ ఆకట్టుకున్నాయి.ఆసరా నిధులకు సంబందించిన చెక్కును మేరిగ మురళీధర్, దేవసేనమ్మ తదితరుల చేతుల మీదుగా లబ్ధి దారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పుర పాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, వైసీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లు విజయకుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొమిడి శ్రీనివాసులు, నాయకులు కోడూరు మీరారెడ్డి, కోదండ రామయ్య, సాయి, గోపాల్ యాదవ్, ముని, పూర్ణ, గఫూర్, ఆల్తాఫ్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి పొదుపు మహిళల స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న పోణకా దేవసేనమ్మ

16న 'గ్రామీణ భారత్ బంద్'ను జయప్రదం చేయండి: సీఐటీయూ

ప్రజాశక్తి -కోట : ఈ నెల 16 తేదీ నిర్వహించనున్న 'గ్రామీణ భారత్ బంద్'ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.కోట మండల కేంద్రంలో ఆటో వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు, బి గోపాలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆటో కార్మికులు ఐక్యంగా ఉండాలని చదువుతో నిమిత్తం లేకుండా లైసెన్సులు, బ్యాడ్జీలు ఇవ్వాలని కోరారు. ఆటో స్టాండ్లు ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలని, 16న జాతీయ స్థాయిలో సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రామీణ భారత్ ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని , ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం ఆపాలని అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత చట్టం ఏర్పాటు చేయాలని, అన్ని రకాల వస్తువులపై జిఎస్టి తొలగించాలనే డిమాండ్లతో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బి గోపాలయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల ఐక్యంగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడమే కేంద్రంలో బిజెపికి అలవాటుగా మారిందని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కర్లపూడి రమణయ్య, హరినాథ్ ఆటో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుపతి ఎంపీగా పోటీ చేస్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి ఎంపి గా పోటీ చేస్తానని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేకరుల తో మాట్లాడుతూ తిరుపతి ఎంపీ , గూడూరు ఎమ్మెల్యేగా ఎంతో అభివృద్ధి చేసి, ప్రజల మన్ననలు పొందామని పేర్కొన్నారు. వైసిపిలో చేరి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశానని వరప్రసాదరావు తెలిపారు. గ్రూపు రాజకీయాలు తనకు తెలియవని, పవన్ కళ్యాణ్ పిలుపుమేరకే ఆయనను కలిశానని. ఆ విషయాన్ని సీఎంజగన్మోహన్ రెడ్డికి చేరవేశానని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని లేకుంటే తదుపరి కార్యచరణ త్వరలో మీడియా ముందు ప్రకటిస్తానని తెలిపారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు పెండ్లి కానుకలో మొండి చేయి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందిస్తున్నామని డప్పు వాయించుకొనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రతిభావంతుల కు పెండ్లి కానుకలు మొండి చెయ్యి చూపించారని పెరుమాళపల్లికి చెందిన టిడిపి నాయకులకు ప్రత్యేక ప్రతిభావంతుడైన జీవన కుమార్ రెడ్డి వివరించారు. శనివారం చంద్రగిరిలో మీడియాతో మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలుగా వికలాంగులకు పెళ్లి కానుకలు అందించకుండా ప్రత్యేక ప్రతిభావంతులకు ఆంక్షలు పెట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయ దుందుభి మోగించి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని , చంద్రగిరిలో పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలవాలంటూ తనకు అంగవైకల్యం ఉన్నప్పటికీ ఇటీవల శ్రీవారి మెట్టు ద్వారా నడిచి వెళ్లి శ్రీవారికి మొక్కులు చెల్లించుకున్నానని తెలిపారు.

'రా కదిలి రా..' సభను జయప్రదం చేయాలి: టిడిపి

ప్రజాశక్తి- కెవిబిపురం: ఈ నెల 6వ తేదీ నిర్వహించనున్న చంద్రబాబు'రా కదిలి లా' బహిరంగ సభకు టిడిపి, జనసేన నాయకులు కలిసికట్టుగా తరలి వచ్చి జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు రామాంజులు నాయుడు కోరారు. కెవిబి పురం మండలం టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తలతో సమావేశం శనివారం నిర్వహించారు. చంద్రబాబు బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గుడిపాల మండలం టిడిపి, అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు తిరుపతి పార్లమెంటు రైతు అధ్యక్షులు కనపర్తి గోపీనాథ్ రెడ్డి తిరుపతి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి ముని శంకర్, జనసేన అధ్యక్షులు రూప్ కుమార్, ప్రశాంత్, ఆదికేశవులు యాదవ్, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : గంగాధరనెల్లూరులో ఈనెల 6వ తేదీన జరగనున్న 'రా కదలిరా బహిరంగ సభ' ను విజయవంతం చేయాలని నగరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనారిటీ సోదరులు కలసి నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే, పరిశీలకులు షాజహాన్ బాష పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని టిడిపి ముస్లిం మైనారిటీ టిడిపి నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన షాజహాన్ బాషా మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ముస్లిం మైనారిటీ సోదరులు కలిసికట్టుగా చంద్రబాబు నాయుడు విజయానికి సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో బహిరంగ సభకు ముస్లిం మైనారిటీలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం టిడిపి నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు జి జీవరత్నం నాయుడు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఏ ఆనంద్, పార్లమెంట్ అధికార ప్రతినిధి నబిమస్తాన్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఖాజాపీర్, పుత్తూరు పట్టణ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, నాయకులు రఫీ అహమ్మద్,బావాజీ, చాను పాల్గొన్నారు.

ఆధిపత్య కులాలు బీసీలను అణచివేస్తున్నాయి..

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంగళరావు యాదవ్ ఆవేదన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దశాబ్దాలుగా స్వతంత్ర భారతదేశంలో సమాజ నిర్మాణానికి ఉపయోగపడిన బీసీ కులాలను ఆధిపత్య కులాలు అణచి వేస్తున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం గతేడాది డిసెంబర్ 7న ఇచ్ఛాపురం నుండి మరో స్వాతంత్ర పోరాట రథయాత్రను ప్రారంభించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 99 నియోజకవర్గాల ప్రజలను చైతన్యం చేస్తూ 100 నియోజకవర్గ తిరుపతిలో భారీ బహిరంగ సభతో ముగింపు చేస్తున్నామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలను బీసీలకు ఇవ్వాలని, లేనిపక్షంలో పల్లెనిద్ర, రచ్చబండలతో ప్రజలకు బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 90 అసెంబ్లీ స్థానాలు, 13 పార్లమెంటు స్థానాలు, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు సీట్ల కేటాయింపు ఇలా పలు డిమాండ్ల సాధన కోసం ఆదివారం ఇందిరా మైదానం వేదికగా ప్రజా సింహ గర్జన సభను నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా నిర్వహించే సభకు బీదా మస్తాన్ రావు, ఆర్‌కృష్ణయ్య హాజరవుతున్నారని, జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అన్నా రామ చంద్ర యాదవ్ ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు నూకానమ్మ, అశోక్ సామ్రాట్ యాదవ్, పాల్గొన్నారు.

క్రైం న్యూస్

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పరిధిలోని చెన్నూరు ప్రాంతంలోని కొత్తగుంటలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి, రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని వెలికి తీశారు. గూడూరు రూరల్ ఎస్ఐ కథనం మేరకు సోమవారం రాత్రి గూడూరు పట్టణానికి చెందిన గోళ్ల కృపానందం(29) కనిపించడం లేదని కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారన్నారు. శనివారం చెన్నూరులోని కొత్త గుంట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో, మృతదేహం గూడూరుకి చెందిన కృపానందందే అని గుర్తించామన్నారు. మృతుడికి భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఇతను బ్యాంకులో మెసెంజర్‌గా పని చేస్తున్నారన్నారు. మృత దేహంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సెబ్ తిరుపతి అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు తిరుపతి రూరల్ మండలంలోని తిరుచానూరు గ్రామం చివరిలో పోలీసులు శనివారం నిర్వహించిన దాడుల్లో రెండు కేజీల గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకున్నట్లు తిరుపతి రూరల్ సీఐ భీమలింగం తెలిపారు. స్థానిక శివ జ్యోతి నగర్ కు చెందిన చెరుకూరి రాజా, అంబేద్కర్ నగర్ కు చెందిన శివాలు నవీన్ ను తిరుచానూరు రెండు కిలోల గంజాయిని తరలిస్తుండగా, పోలీసులు పసిగట్టి అదుపులో తీసుకున్నారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు ఈ దాడులలో తిరుపతి రూరల్ సబ్ స్టేషన్ సీఐ భీమలింగ, హెడ్ కానిస్టేబుల్ లు రవి చిరంజీవి, కానిస్టేబుళ్లు అశోక్, మహేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

41 మోటార్ సైకిళ్లు పట్టివేత


పోలీసులు స్వాధీన చేసుకున్న ద్విచక్రవాహనాలు

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట పోలీసులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి 20 లక్షలు విలువ చేసే 41 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని ముగ్గురు ద్విచక్ర వాహనాల దొంగలను అరెస్టు చేశారని తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో శనివారం మీడియా సమావేశంలో ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి, రేణిగుంట, అలిపిరి పార్కింగ్ ఏరియాలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయని వీటిపై ప్రత్యేక దృష్టి సారించిన రేణిగుంట డిఎస్‌పి భవ్య కిషోర్ పర్యవేక్షణలో రేణిగుంట సీఐ సుబ్బారెడ్డి ఐడి పార్టీ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిఘా వేశారన్నారు. రేణిగుంట ఆర్పీఎఫ్ పోలీసులు సహకారంతో సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితులను గుర్తించామన్నారు. శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలోని వేణుగోపాలపురం క్రాస్ వద్ద ద్విచక్ర వాహన దొంగలు అన్నమయ్య జిల్లా కోడూరు అనంతరాజంపేట గ్రామానికి చెందిన పాత నేరస్తులు కలిశెట్టి సుబ్రహ్మణ్యం, కోడూరుకు చెందిన గిద్దలూరు సుబ్రహ్మణ్యం, తమిళనాడు రాష్ట్రం అంబత్తూరుకు చెందిన సయ్యద్ అబ్దుల్ కరీమ్ ను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద సుమారు 20 లక్షల 15 వేల రూపాయలు విలువగల 41 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని ఎస్పీ తెలిపారు. ద్విచక్ర వాహన దొంగలను పట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంస పత్రాలు అందించారు. ఈ సమావేశంలో గాజులమండ్యం సిఐ సుబ్బరాయుడు పాల్గొన్నారు.